తొలకరి చినుకులు

నానీలు



సోమేపల్లి వెంకట సుబ్బయ్య

76116

తొలకరి చినుకులు

(నానీలు)

సోమేపల్లి వెంకటసుబ్బయ్య

TOLAKARI CHINUKULU
NAANEELU (Epigrams)

By
SOMEPALLI VENKATA SUBBAIAH

© Copyrights Reserved

First Edition: February, 2001
Copies : 1,000

Drawings & Cover Design:
UDAY KUMAR

Price : Rs. 25/-

For Copies :
Vishalandra PUBLISHING HOUSE
4-1-435, Bank Street
Vignan Bhavan, Hyderabad - 3
and all its Branches

and

S. Vijaya Lakshmi
W/o Somepalli Venkata Subbaiah
26-104/A, Chandramati Bhavan.
Acharya Ranga Vedhi,
Tanuku - 534 211
☎ (R) 21292, (Off) 22017

Published by:
RACHNA SAAHITI GRUHAM
C/o S.R. Bhallam
Lankala Koderu - 534 250
Ph : 958814 - 58572

Composed By:
VAMSI GRAPHICS, PALAKOL, W.G.. Dt..
☎ 08814 - 26680

C-18913
A C. No. 76116
500 044

"చినుకులో ...
చిగురులో ...
బతుకులో చెలిమిలో
చేతిలో చెయ్యిలో ... !!"

అర్ధాంగి విజయలక్ష్మి కి -
అనురాగంతో . . .
అంకితం

శ్రీ సోమేపల్లి వెంకట సుబ్బయ్య

జన్మభూమి	:	ప్రకాశం జిల్లా, యద్దనపూడి మండలం గన్నవరం గ్రామం
అమ్మానాన్నలు	:	**సోమేపల్లి హనుమంతరావు - నాగరత్నం**
భార్య	:	శ్రీమతి **విజయలక్ష్మి**
పిల్లలు	:	**శ్రీ వశిష్ఠ, శ్రీ విశ్వనాధ విరించి**
చదువు	:	ఎం.,కామ్.
ఉద్యోగాలు	:	ఆంధ్రజ్యోతి దినపత్రికలో సబ్-ఎడిటర్ పిదప **మండల రెవెన్యూ అధికారి** పెంటపాడు, గణపవరం, తాడేపల్లిగూడెం ప్రస్తుతం **తణుకు**
ఇతర రచన	:	**లోయలో మనిషి,** వచన కవితాసంపుటి
తదుపరి రచన	:	**చల్లకవ్వం** వచన కవితాసంపుటి

సోమేపల్లివారి నానీలకు స్వాగతం

డా॥ ఎన్.గోపి
కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత
వైస్‌ఛాన్స్‌లర్, తెలుగుయూనివర్సిటీ, హైదరాబాద్

ఇది నానీల శతకం ... !

అంటే పద్య శతకమని కాదు – నూరు నానీలన్న మాట ..!!

ఇంతకు ముందు – ప్రముఖ కవి ఎస్.ఆర్. భల్లంగారు నానీలకు తొలి వారసునిగా "గూడు వదిలిన గువ్వలు" పేరుతో అద్భుతమైన నానీలు రచించి నాకు అంకితమిచ్చాడు. ఆ నానీలలో తన కవితాశక్తినీ, నూతన అభివ్యక్తినీ సామాజికానురక్తినీ అడుగడుగునా ప్రస్ఫుటం చేయడమే కాదు – నా నానీల కవితా ప్రక్రియపరివ్యాప్తికి ప్రధాన భూమికై ఎందరో ప్రవర్ధమాన కవులచేత వందలాది నానీలు రాయిస్తున్నందుకు అప్పుడు నేనెంతో సంతోషించాను.

అదే సంతోషం ఈనాడు సోమేపల్లి వెంకటసుబ్బయ్యగారి "తొలకరి చినుకులు" చదివితే కలుగుతుంది. భల్లానికి గానీ, సోమేపల్లివారికి గానీ నానీల నిర్మాణం పట్ల పట్టు ఏర్పడిందనటానికి ఇవి నిదర్శనంగా ఉన్నాయి. కవితా శక్తి వారికి ముందే వుంది. అయితే శ్వాస వారిది, మూస నానీలది. నానీల చిన్నారి చట్రంలో పదును తేలిన భావాలను వారు ఎంతో బాగా వ్యక్తీకరిస్తున్నారు. అప్పుడు భల్లాన్ని ఆశీర్వదించాను. ఇప్పుడు సోమేపల్లి వారిని అభినందిస్తున్నాను.

ఒకానొక వర్షాకాలంలో మట్టిని చీల్చుకొని వచ్చిన మృత్తికాసౌరభంలా వెలువడిన నానీలు సోమేపల్లివారి చేత వంద నానీలు రాయించినందుకు నాకెంత సంతృప్తి కలుగుతుందో మీరూహించగలరు.

సోమేపల్లివారు తణుకులో ఎం.ఆర్.ఒ.గా పనిచేస్తున్నారు. ఊపిరి సలపని ఉద్యోగంలో ఉన్నా ఊపిరిలాంటి కవిత్వాన్ని కాపాడుకుంటున్నారు. ఈ పుస్తకం పేరు "తొలకరి చినుకులు". ఇవి తొలకరి చినుకులేగాని తొలి చినుకుల కావు. ఇంతకు ముందే 'లోయలో మనిషి' పుస్తకంతో ఎత్తులకెదిగారు సోమేపల్లివారు.

'అదేం
చిత్రమో
పట్నమెళ్ళి చూస్తే గాని
పల్లె సౌందర్యం తెలియలే ... !

కోనసీమలో వున్నవారికి పట్నంలోని కృత్రిమత్వాన్ని చూస్తే సీమ సౌందర్యం మరింత పెరుగుతుంది.

'పల్లెచెరువులో
తల్లిచేప
పట్నం ఎక్వేరియంలో
పిల్లచేప'

హృదయాన్ని విలవిలలాడించే నానీ ఇది. ఈ నానీ కూడా చూడండి

'కోనసీమ
అంతటా నిశ్శబ్దం
శబ్ద కాలుష్యం
కొంత తగ్గిందిగా ...'

నానీల వల్ల శబ్ద కాలుష్యమే కాదు, భావ కాలుష్యం తగ్గుతుంది. ఈ నానీలను వారి అర్ధాంగికి అంకితం చేసారు. నానీలు అంటే చిన్నపిల్లలు. పిల్లలు అమ్మకేగా అంకితం కావాలి.

పువ్వుకి తావిలా సోమేపల్లివారి నానీలకు **ఆర్టిస్ట్ ఉదయ్** అద్భుతమైన చిత్రాలు గీసినందుకు ప్రత్యేకాభినందన.

ఇలా సోమేపల్లివారి ఉత్తమ నానీలను ఉదాహరించదలచుకుంటే మరెన్నో ఉదాహరించాలి. అన్నింటికి నా చూపు ఇవ్వడం ఎందుకు? నేరుగా మీరే ప్రవేశించండి.

సోమేపల్లివారూ .

మీకు నా హృదయపూర్వక అభినందనలు...!!

గోపి

(ఎన్.గోపి)

తొలకరి చినుకుల్లో మొలిచిన నాణ్యమైన నానీలు

కవి, సాహితీ విమర్శకులు

ఎస్.ఆర్. భల్లం

నానీ -

నాకెంతో యిష్టమైన తెలుగుపదం ...!
మా రెండో అబ్బాయి ముద్దుపేరు "నానీ" కాబట్టి అని కాదు.
నాదీ నీదీ వెరసి మనది ఈ నానీ కాబట్టి ...
చిట్టిపొట్టి చట్రంలో అనుభూతుల్నీ, ఆప్యాయతల్నీ అమర్చుకోవచ్చు కాబట్టి ....
బుడిబుడి పదాల్లో భూగోళమంత భావాన్ని ఇముడ్చుకోవచ్చు కాబట్టి ...
కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత -
కాలాన్ని నిదురపోనివ్వని కవి - డా॥ ఎన్. గోపి మానసకవితా పుత్రిక కాబట్టి...
అందుకే -
నానీ అంటే నాకు అవ్యాజమైన అభిమానం ... అపారమైన ప్రోత్సాహం ...!

డా॥ ఎన్. గోపి నానీలు చదివాకా - ఆ ఆకర్షణతో వందలకొద్దీ నానీలు రాసి "గూడు వదిలిన గువ్వలు" అనే పుస్తకం వేసి - నానీల నాన్న - గోపీసార్‌కి నానీల తొలివారసునిగా అంకితం ఇవ్వడం జరిగింది.

నాకున్న మంచిమిత్రుల్లో తొలి పంక్తిలో మెదిలే కవిమిత్రులు సోమేపల్లి వెంకటసుబ్బయ్యగారు. వృత్తివేరు - ప్రవృత్తివేరు గల మనీషి ఆయన. వృత్తి మండల రెవెన్యూ అధికారి. ప్రవృత్తి నిరంతర కవితా ప్రపంచ విహారి. ఏవేళ మా ఇద్దరినీ సినీ కవి రసరాజుగారు కలిపారో ... ఆవేళనుంచి కవితా సుగంధం మా మధ్య అంతరాలకందని ఆప్యాయతానురాగబంధమయ్యింది. అప్పటికే ఆయనకి "లోయలో మనిషి" కవితాసంకలన కవిగా ప్రఖ్యాతి ఉంది.

ఓ చల్లని సాయంత్రం - మా కవితా కబురుల్లో నానీల ప్రస్తావన రావడం ఆ నూతన కవితా ప్రక్రియ లక్ష్య లక్షణాలు గురించి సవివరంగా నేను చెప్పడం ఆయన ఆ విషయాల్ని ఆసక్తిగా విని అపూర్వ అనుభూతి చెందడం - తద్వారా ఆ కొద్దిసేపట్లోనే ... గొప్పవైన పది నానీలు రాసి నాకు చూపించడం జరిగింది. అప్రయత్నంగా ఆశ్చర్యపోయాను. పదినెలలకి పైగా అవిరళ కృషితో అపూర్వ సాధనతో అలవర్చుకొన్న నానీల తత్వ మహత్వాన్ని ఇదేమిటి ఈయన పదినిమిషాల్లో జీర్ణించుకొని నాణ్యమైన నానీలను అద్భుతంగా వెలయించగలిగారు? "ముఖేముఖే సరస్వతి" అంటే ఇదేనేమో...?

"చల్ల కుండలో
కవ్వం తందనాలు
బుడత నోట్లో
వెన్న బుడగలు"

పల్లెతనం పచ్చతనాన్ని అణువణువూ అలదుకొన్న అచ్చమైన గ్రామీణ కవి మాత్రమే ఈ నానీ రాయగలడు.

"బుల్లి తెరేనని
సరిపెట్టుకోకు
బుర్రలు
చెడగొడుతుంది"

నిజమే – మన సంస్కృతినీ, సాంప్రదాయాన్నీ దైనందిన జీవన విధానాన్నీ ధ్వంసం చేస్తూ మన ధనాన్నీ, కాలాన్నీ, ఆరోగ్యాన్నీ హరించే టి.వి. ఛానళ్ళను అనుక్షణం వీక్షించే ప్రేక్షకాళికి చెంపపెట్టు ఈ నాని.

"బూడిదంటే
చులకన ఎందుకు?
అది
జీవితపు తుదిజాడ"

"కళ్ళు తెరిస్తే జననం – కళ్ళు మూస్తే మరణం నడుమే జీవితం" ఆ జీవితపు తుదిజాడ బూడిదే కదా ! ఆహా! ఎంత నగ్నసత్యం" జీవితాన్నంతా కాచి వడబోసినట్లు ...

"బిందువ్వూ బిందువ్వూ
సింధువైనట్లు
ఊరిజనమంతా
బంధువులే ..."

అందరిలోనూ పుటకనేలమట్టితనం ప్రవహిస్తే బంధుత్వం గట్టిపడుతుందనటానికి ఈ నానీని ఉదాహరణగా చెప్పుకోవచ్చు.

"వళ్ళంతా
కళ్ళు చేసుకోవాలి
కాన్వెంట్ రిక్షాలో
కదులుతుంది బాల్యం"

కళ్ళు తెరవని చిన్నారుల్ని కాన్వెంట్ చదువుల మోజుతో వాళ్ళ బంగరు బాల్యాన్ని తల్లిదండ్రులు పణంగా పెడుతున్నారని సెటైర్‌గా చెప్పడం బావుంది.

"పల్లెతనం
చల్లని చద్దిబువ్వ
పట్నవాసం
వేడి వేడి ఫాస్ట్‌ఫుడ్"

పల్లె చల్లని తల్లి అని పట్నం పరువాల పాలవెల్లి అని ఎంత చక్కని విశ్లేషణ.

"నేలతల్లికి
అవయవాలు
చెట్లూ చేమలూ
వాగులూ వంకలూ"

ఎంత చక్కని నానీ. ఇటువంటి చక్కని, చిక్కని నానీలు ఈ 'తొలకరి చినుకులు' లో ఎన్నో ... మరెన్నో ... !?

"తొలకరి చినుకులు" నానీలు –
పల్లెతనానికీ, తల్లితనానికీ ప్రతీకలే కాదు
సామాజిక స్పృహాతత్వానికి చక్కని ఉదాహరణలు ...!

అనుభూతినీ, ఆలోచననీ, ఆప్యాయంగా, ఆత్మీయంగా అక్షరీకరించడం – శ్రీ సోమేపల్లి వెంకటసుబ్బయ్యకి వెన్నతో కాదు–పెన్నుతో పెట్టిన విద్య ...!!

వెన్నెలకి తావి అబ్బినట్లు సోమేపల్లివారి అక్షరాలకు అద్భుతమైన చిత్రాలను అందించిన ఆర్టిస్ట్ ఉదయ్ ప్రశంశాపాత్రులని చెప్పక తప్పదు.

మంచి కవితా సంకలనం రావటంలేదని మైకుల్లోనూ, మనసుల్లోనూ అంగలార్చే సాహితీవేత్తలూ, సాహిత్యాభిమానులూ ఈ సోమేపల్లివారి "తొలకరి చినుకులు" చదివాక ఎట్లా స్పందిస్తారో చూడాలి మరి.

ఒక్కటి మాత్రం నిజం.

రాబోయే కవితాకాలమంతా నానీల మయం కాగలదన్న ప్రగాఢవిశ్వాసంతో...

ఎస్. ఆర్. భల్లం

(ఎస్.ఆర్. భల్లం)

ఏ వేళ -

ఎస్. ఆర్. భల్లం గారి నోట నానీల మాట విన్నానో...

ఏ పూట -

డా॥ ఎన్. గోపి గారి నానీల పుస్తకాన్ని చదివానో ...

ఆ క్షణం నుంచి-

నానీలు నాకు వశమయ్యాయో...

నానీలకు నేను వశమయ్యానో...

అర్థం కాని అనుభూతి ... !

అప్పుడు పడింది -

నానీలకు అసలైన బాట

ఆ బాటలో బాసటగా నిలిచి ప్రోత్సహించిన

డా॥ ఎన్.గోపి

శ్రీ ఎస్.ఆర్.భల్లం

శ్రీ అద్దేపల్లి రామమోహనరావు

శ్రీ రసరాజు

శ్రీ ద్వా.నా. శాస్త్రి

శ్రీ ఆర్టిస్ట్ ఉదయ్

వంశీ గ్రాఫిక్స్ శర్మ

సత్యా ఆఫ్‌సెట్ వారికీ

ముద్రించిన ముఖ్య పత్రికలకీ

హృదయపూర్వక కృతజ్ఞతలు ...!!

అంకితమందిన అర్ధాంగి విజయలక్ష్మి కీ ...

చిన్నారులు శ్రీ వశిష్ఠకీ, శ్రీ విశ్వనాథ విరించి కీ

అభిమానపూర్వక ఆశీస్సులు ...!!!

ఎంత అందంగా వుంది
ఈ ప్రపంచం ...
పెట్టుకుంది
రంగుటద్దాలు మరి ... !

ఊహల ఊయల్లో
వూగి వూగి ...
గుండె గూట్లో
చిరుగువ్వలా ఊరు....!!

అందమైన అల్లికకు ఆదర్శం
సాలెపురుగా ... !
కాదు -
కమ్మని కవిత్వం ... !!

కాసేపు
అంతటా నిశ్శబ్దం
శబ్ద కాలుష్యం
కొంత తగ్గిందిగా ...

చల్లకుండలో
కవ్వం తందనాలు
బుడత నోట్లో -
వెన్న బుడగలు

మాటా మంతీ
ఇంటర్నెట్‌లోనే ...
మానవ అనుబంధాల
మాటేమిటి ...?

"క్లిక్" మంది
కళ్ల కెమేరా
మనసు గదిలో ప్రింటైంది
ఆమె బొమ్మే

ఆషాఢ భూతి
అడ్రసు కావాలా
చుట్టూ-
తిరిగి చూసుకోమరి

బుల్లితెరేనని
సరిపెట్టుకోకు ... !
బుర్రలు
చెడగొడుతుంది ... !!



బూడిదంటే -
చులకన ఎందుకు ... ?
అది
జీవితపు తుదిజాడ ... !!

ఫేసుల్ని
ప్రేమిస్తే ఏం లాభం ... !
మనసులో
మమత లేనప్పుడు ...

బిందువూ బిందువూ
సింధువైనట్టు
వూరి జనమంతా
బంధువులే...



పసిమి
ఆటపాటలు
భద్రంగా పేర్చుకుంది -
మనసు ఆల్బం.

"నానీ" యేకదా
నాకు తోడు
ఆలోచనలోనూ...
ఆవేశంలోనూ...

చిన్నప్పటి
ఉత్తుత్తి బువ్వలాటలు
పెద్దయ్యాక -
నిజమై పోయాయేమిటి ...?

బెలూన్లు చూస్తే
బాల్యం గుర్తొస్తుంది
తాయిలం కోసమే
బడికి వెళ్ళింది

జీవిత నౌక
తీరం చేరేవరకూ
చుక్కాని కోసం
వెతుకులాటే....

అందంగా లేనని
బాధపడకు
మనసు అద్దంలో
మసిలేది నిజం ...!



ఎన్నికల
కోలాహలం
సమీకరణాల్లో-
పుడుతుంది హాలాహలం.....

ఆశను
అక్కున చేర్చుకుంటే
కళ్ల లోగిళ్లలో
వెలుగు తోరణాలే...

మనసు
రంగుల గాలిపటంలా
బాల్యంలోకి
ఎగిరిపోతుంది



గోరుముద్దల
గొంతుకకి
అమ్మ చేతి చలువ
ఎపుడూ గురుతే...

గణగణ గంట
జ్ఞాపకాలలో...
బడికాదు
బాల్యమిత్రులు

విత్తును బట్టే
మొక్క
వేటును బట్టే
తెగుతుంది చెక్కముక్క...!!

ఊహల్నీ
ఉబికే ఉత్సాహాన్నీ
ఆశల సంచిలో
మోసుకొస్తాడు వాడు

బాధల గాధలు
మరవాలంటే
బంగరు బాల్యానికి
బందీ అవాల్సిందే....

పోయినోళ్ళందరూ
స్వర్గస్థులే అయితే
నరకం
చిరునామా...?

సద్దుమణిగిందనుకున్న
స్వార్థం
మళ్ళీ లేచింది
మనిషితో పాటే...?

మీ భద్రతే -
మా లక్ష్యమా...?
అయితే-
మా భద్రత ఎవరి లక్ష్యం...!?

వళ్ళంతా
కళ్ళుచేసుకోవాలి
కాన్వెంట్ రిక్షాలో
కదులుతోంది బాల్యం

అదేం
చిత్రమో
పట్నమొచ్చిచూస్తే గాని
పల్లెసౌందర్యం తెలియలే....!

అతుకుల బతుకుల
ఆచ్ఛాదనమా
చినిగిన చొక్కాయే
చిహ్నంగా...

పలకంటే
మహా ప్రాణం
అక్షర సౌధానికి
అదే కదా పునాది....

తొలిచూపు
ప్రేమ
తొలకరి జల్లులో
మొలిచిన మొలక

పల్లెదనం
చల్లని చద్దిబువ్వ
పట్నవాసం
వేడివేడి ఫాస్ట్ ఫుడ్...

ఆమెతో
మాట్లాడితే
చూపుల చూరికి-
మనసు మౌనంగా వేళాడ్తుంది

ఆమె అందం
అపురూపం
మనసు మాత్రం
పూలదండో... రాతిబండో ...?

వెతలకథల్ని
కంచికి పంపాలంటే
మరోసారి
కవిత్వంలో మునిగిపో.....

చిన్న చేపల్ని
పెద్ద చేపలు
సమానధర్మంగా
పల్లెల్ని పట్నాలు..

వానొస్తే బురద
ఎండొస్తే దుమ్ము
అన్నిటిని
భరించేదే శరీరం

చెప్పేదొకటి
చేసే దొకటి
వాడు
అస్థిరత్వానికి ఆనవాలు...

న్యాయస్థానంలోనే
కాదు
గెలుపు ఓటములు
జీవితంలో కూడా...

ఆశకి
నిరాశకి మధ్య -
రంగురంగుల
సీతాకోక చిలుకలు

ఎన్నికల
వాగ్దానాలు
వాత్సల్య లేపనం కింద
వడగాడ్పు

డబ్బుకి
స్వేచ్ఛ ఎక్కడుంది ... ?
దాని బతుకెపుడూ
బందిఖానాయే ...

పల్లె బాల్యం
పట్నం చేరింది
ఉత్సాహంగా
ఊడిగం చేయడానికి.....

బాల్యంలోకి
తొంగిచూద్దును కదా
ముఖానికి బదులు
గాయం

రంగురంగుల
రెపరెపలు
పసికళ్ళలో
మెరిసే తళతళలు

నవ్వింది
ఆ ... పిల్లేనా !?
అర్థమే మారిపోయింది
వయసుతో పాటే....

పట్టాలమీద
గూడ్సుబండి
తల్లి వెన్నంటే గదా
పిల్లలు కూడా ...

అరే....
ఇక్కడ ఊళ్ళుండాలే
ఏమీ...
గోదారికి కోపం వచ్చిందా....!

కన్నీళ్ళు
కడలిగా పోటెక్కుతుంటే
కష్టాలెక్కడ
యింకుతాయి...

అదే
వాగ్దాన పరంపర
అందలమెక్కేదాకా
అసలు రంగు తెలీదు...

పుస్తకం
మస్తకానికి చేరువలోనే
ఒంటరితనం
నన్నేమీ చేయలేదు.

రక్తానికీ
గ్రూపులున్నాయి
పాపానికి
పలు మార్గాలున్నట్లు....

సర్దుబాటు
ఓటమి వొడి పాపకాదు
గెలుపు ముడి విప్పే
తాళం చేయి

బతుకు పుస్తకంలో
దుఃఖిత గాథలే కాదు
ఒక్కోసారి
సుఖాలు కూడా....

కాగితం
నిండా వెలుగే
కొంపదీసి
కలంలో చైతన్యం నింపావా...!

అవినీతిని
అటకాయించి చూడు...!
అమ్మ్యామ్యా
ఆత్మహత్య చేసుకొంటుంది

ఐడ్డిగం
గొంతులో విత్తులు
రైతు మదిలో
ఆశల గుత్తుల గుత్తులు



ఆదివారం
అప్పుడే అయిపోయింది
వారందాకా
ఎదురుచూపే

వాళ్లది
కంప్యూటర్ లవ్
వైరస్ సోకకుండా
చూసుకోవాలి మరి !

చెట్టును
నాటి చూడు
కాలుష్యం గొంతులో -
సుగంధమై పరిమళిస్తుంది

76116

ఎగిరే పిట్టలకి
ఎంతకట్టుబాటో...
చూసి నేర్చుకోవాలి
సమైక్యత

పల్లె చెరువులో
తల్లి చేప
పట్నం ఎక్వేరియంలో
పిల్లచేప

ప్రేమ మైకంలో
ప్రియా, ప్రియా ..
పెళ్లి పర్వం ముగిసాక
ఏమేయ్. ఒసేవ్ !!



'పెద్ద'గా
అలిసినప్పుడల్లా
చిన్నారి బుగ్గపై
మొగ్గనై నేను ...

నేల తల్లికి
అవయవాలు
చెట్లూ చేమలూ
వాగూ వంకలూ

రాజకీయ తెరపై
ప్రధాన భూమిక
అర్థంకాదు
స్వార్థం

నువ్వే నేను
నేనే నువ్వు
మనిద్దరి మధ్య
పవిత్ర పరిచయం

గుండెగూట్లో
గిలిగింతలు
వయసు వాకిట్లో
కిలకిల పులికింతలు

కవితా ప్రవాహం మీద
కలకాలం
కవీ! కావ్యమూ !!
తేలియాడేది ?



కాగితం
పడవలు సిద్ధం
వర్షం మాత్రం
ఎప్పుడొస్తుందో ఏమో !!

బతుకు బండి
మొండికెత్తింది
ఇరుసుపై
కాసుల యింధనం కరవై -

ఊరంతా
మేడల నీడలో
పల్లెతనం తీపి గుర్తుగా
మర్రి ఊడలు



మౌనం
ఇద్దరి మధ్యా -
మనసూ మనసూ
రాజీ పడలేదంటే !!

హాలో
అలల మీద కాసేపు
అమ్మయ్య -
కష్టాల్ని మర్చిపోయా

కులం కుంపటి
ఆరిపోయింది
వర్గం లేకుంటే
స్వర్గమే కదా



అందరి కళ్ళూ
అతడి మీదే...
పదవి
పెదవికన్నా తీపికదా

మాటల్ని
అదుపు చేసి చూడు
గొడవ
గొంతు దాటితే ఒట్టు !

అంతే మరి
నేల విడిచి సాము చేస్తే
బుద్ధి
బొక్క బోర్లా పడుతుంది



కరెన్సీ -
కాగితం ముక్కే
కానీ ....
సృష్టికర్తనే సుళ్ళు తిప్పుతుంది

తప్పు చేసి వుంటావ్
లేక పోతే
ఒప్పుకెందుకు
భయపడతావ్ !?

సైబర్ లోకంలో
ఆలోచన
ఆచరణకి
అమడ దూరమేమో ...

సమస్యని
సంధించమంటావా
పరిష్కార కవచం
పగిలి పోలేదుగా ...

పెచ్చులు పెచ్చులు
రాల్చేది గోడేనా..
పతనం అంచున
పరిస్థితి కూడా

కాలం
కబోదికాదు
నిజా నిజాల్ని
నిర్దయంగా నిగ్గు తేలుస్తుంది

ఎదుగుదల
ఎంతదాకా...?
ఊపిరి
ఉత్సాహంతో పూరేగేదాకా ..!

కిటికీకి అవతల
వయసు గత్తె
చిటికెలో
గుండె వాకిట్లోకి ..

భుజం మీద
కావిడి
బతుకు బరువు మోతకై
హడావిడి

బింబ ప్రతిబింబాల
మధ్య
మమతల వంతెన
అద్దమంటే ఏమంటావ్

కుర్రతనమా
బడాయిలు పోకు
ముందుంది
ముసలి మొసలి

కుండీలో
కల్పవృక్షానికి
బాల్యం, యవ్వనం, వృద్ధాప్యం
కుదింపే...

కొందరికి దండగ
కొందరికి పండగ
ఊళ్ళోకి
వరదొచ్చింది....

గాజూ బూజూ
ప్రాస సరిపోయింది
పగిలేదొకటి
పోగిలేదొకటి

మరపు
మనిషికి వరమైతే
జ్ఞాపకం
ఓ శాపం కాదుగా

అందం
అంగట్లో కెళ్లడం పాపం
అంగుట్లో ఆకలి
మటుమాయం

వాడో
కఠిన శిల
సంగీతంతో
రాళ్లనెలా కరిగిస్తాడు ..

నింగికీ నేలకీ
నిచ్చెనలుగా...
అంతరాలు లేని
అపార్టుమెంట్లు

A C No. 76116
హైదరాబాద్-500 044.



చెలిమికి
చిరునామా
మనిషిని తడితే
మనసు పలుకుతుంది

Tolakari Chinukulu

Somepalli Venkata Subbaiah

"సోమేపల్లి వారు తణుకులో ఎం.ఆర్.ఒ.గా ఊపిరి సలపని ఉద్యోగంలో ఉన్నా
ఊపిరిలాంటి కవిత్వాన్ని అనునిత్యం కాపాడుకుంటున్నారు.
ఇంతకుముందు 'లోయలో మనిషి' కవితా సంకలనంతో ఎత్తులకెదిగిన వీరు -
ఈ "తొలకరి చినుకులు" నానీలతో పదునుతేలిన భావాల్ని విత్తుల్లా మొలిపిస్తున్నారు."

- కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డా॥ ఎన్.గోపి.

"తొలకరి చినుకులు" నానీలు - పల్లెతనానికీ, తల్లితనానికీ ప్రతీకలే కాదు -
సామాజిక స్పృహాతత్వానికి చక్కని ఉదాహరణలు ..!
అనుభూతినీ, ఆలోచననీ, ఆప్యాయంగా, ఆత్మీయంగా అక్షరీకరించడం -
సోమేపల్లి వెంకటసుబ్బయ్య గారికి వెన్నతో కాదు - పెన్నుతో పెట్టిన విద్య.. !!

కవి, సాహితీ విమర్శకులు ఎస్.ఆర్.భల్లం.